క్లుప్తంగా

'ఉపాధి'లో చెరువు పూడికతీత పనులు



దమ్మెన్నులో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

ఉండ్రాజవరం: మండలంలోని దమ్మెన్ను గ్రామంలో పంచాయతీకి చెందిన ఊర చెరువు పూడిక తీత పనులను ఉపాధి హామీ పథకంలో చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దాదాపు 5.34 ఎకరాల విస్తీర్ణంలోని ఈ చెరువు పూడికతీత పనులకు రూ.9.30 లక్షలు కేటాయించినట్టు ఎంపీడీఓ ఎ. శ్రీనివాసు తెలిపారు. తొలిరోజు పనులను ఎంపీటీసీ సభ్యుడు జి.రామకృష్ణ, ఎంపీడీఓ శ్రీనివాసు, హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ కాంతారావు పర్యవేక్షించారు.

చలివేంద్రాలు ప్రారంభం

నిడదవోలు రూరల్: తృప్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని సమిశ్రగూడెం పోలీస్ సబ్ కంట్రోల్, సిలువ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు చలివేంద్రాలను నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ట్రస్ట్ నిర్వాహకులు వడ్లమూడి దేవదాస్, సుమతి, సుదర్శన్ ఆర్థిక సాయంతో పోలీస్ స్టేషన్‌కు వాటర్ ఫిల్టర్, ఫ్రీజర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కే సుభానీ, ఏఎస్సైలు ఆంజనేయులు, పరమహంస, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నెలటూరులో వైద్యశిబిరం

చాగల్లు: మండలంలోని నెలటూరు సీతారామ స్వామి కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చాగల్లు–నెలటూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రాజానగరానికి చెందిన జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు సేవలు అందించారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న 1200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

14న భారత్ బచావో

ప్రకాశం నగర్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 14న నరేంద్ర మోదీ హటావో– భారత్ బచావో పేరుతో ఆందోళన నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఓబులేసు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, కేజ్రీవాల్‌పై కక్ష సాధింపు ధోరణి ప్రజాస్వామ్య మనుగడకి విఘాతం కలిగిస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బీవీ కొండలరావు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు పాల్గొన్నారు.

'మిస్టర్ ఆంధ్రా'కు కొవ్వూరులో సన్మానం

కొవ్వూరు: పట్టణానికి చెందిన ఎలుబండి వెంకట సత్యనారాయణ అనే యువకుడు ఏపీ స్టేట్ బాడీ బిల్డింగ్ సీనియర్స్ విభాగంలో మిస్టర్ ఆంధ్రా టైటిల్ గెలుచుకున్నాడు. అతడిని మాజీ ఎమ్మెల్యే, జనసేన నాయకుడు టీవీ రామారావు ఆధ్వర్యంలో కొవ్వూరులో ఆదివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి పెదనాన్న సంరక్షణలో ఉంటూ తన ఉద్యోగం తాను చేసుకుంటూ తనకు ఇష్టమైన బాడీ బిల్డింగ్‌లో రాణించడం హర్షణీయం అన్నారు.నాయకులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, కల్లేపల్లి ప్రభాత్, గంధ్రోతు పవన్ సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

కరోనా వారియర్స్‌కు సత్కారం

ప్రకాశం నగర్ : ప్రజాపితా బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గాంధీపురంలో డివైన్ మెడిటేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరోనా వారియర్స్ పతంజలి శ్రీనివాస్, డీహెచ్‌వో రమేష్ కిషోర్‌ను సత్కరించారు. బ్రహ్మకుమారి హేమ మాట్లాడుతూ శరీరానికి యోగా ఎంత అవసరమో, జీవితంలో వచ్చే మానసిక పరిస్థితులను ఎదుర్కోవడానికి రాజయోగా మెడిటేషన్ అంత ఉపయోగపడుతుందన్నారు.

ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టి..

- కాలువలు, డ్రైన్లకు అడ్డుకట్టలు
- ఇంజిన్ల సాయంతో పంటలకు నీరు
- డీజిల్‌ను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం
- రబీ నీటి ఎద్దడిని అధిగమిస్తున్న వైనం



పెరవలి వద్ద మురుగు కాలువ ప్రవాహానికి వేసిన అడ్డుకట్ట



ముక్కామల వద్ద కాలువ నుంచి నీటిని తోడుతున్న డీజిల్ ఇంజిన్

పెరవలి: రైతులు, నీటిపారుదల శాఖ అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ రబీ పంటలకు నీటి ఎద్దడిని అధిగమిస్తున్నారు. ఏటా దాళ్వా పంట ఆఖరిలో ఎండలు తీవ్రతరం అయ్యాక నీటి ఎద్దడి ఏర్పడడం సహజం. వంతుల వారీ విధానాన్ని అవలంభించడం ద్వారా రైతులు ఈ సమస్యను కొంత మేర పరిష్కరించుకుంటున్నారు. వారి ప్రయత్నానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా అండగా నిలుస్తోంది. డీజిల్ ఇంజిన్ల సాయంతో కాలువల్లోని నీటిని ఎత్తిపోసి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటోంది. సొంతంగా ఇంజిన్లు ఉన్న రైతులకు డీజిల్‌ను ఉచితంగా సరఫరా చేస్తోంది. నిడదవోలు నియోజకవర్గంలోని ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టుకు నీటి సమస్య ఏర్పడింది. గోదావరిలో నీటి లభ్యత తగ్గిపోవడం ఇందుకు కారణం. పరిస్థితిని గ్రహించిన అధికారులు, ప్రజాప్రతినిధుల మురుగు కాలువలు, డ్రైన్లపై అడ్డకట్టలు వేసి నీటి సమస్య లేకుండా చేశారు. నీరు తక్కువగా ఉన్న చోటల్లా డీజిల్ ఇంజన్లతో నీటిని తోడి పోసి పంటలు ఎండిపోకుండా జాగ్రత్త వహించారు. దాంతో రబీ పంటకు నీటి సమస్య తీరింది.

ఇదీ నీటి లభ్యత పరిస్థితి

కాకరపర్రు కెనాల్ నుంచి సాధారణంగా 2,200 పైగా క్యూసెక్కుల నీరు విడుదల కావలసి ఉంది. ఈ కెనాల్ నుంచి ప్రస్తుతం 1,300 నుంచి 1,400 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా అవుతోంది. ఈ నీటిని వంతులవారీ విధానంలో చిన్న, పిల్ల కాలువలకు సరఫరా చేస్తున్నారు. దాంతో మెరక ప్రాంత పంటలకు నీరు అందడం లేదు. దాంతో పెరవలి, ఉండ్రాజవరం, తణుకు, ఇరగవరం మండలాల్లోని వెలగదుర్రు, ఉండ్రాజవరం, ముక్కామల, న్యూ విప్పర్రు కాలువలకు, రాజుల బోదెకు నీటి కొరత ఉంది. ఈ కాలువల పరిధిలో సుమారు 1,400 ఎకరాల ఆయకట్టు ఉండగా, అందులో వెయ్యి ఎకరాలు పెరవలి, ఉండ్రాజవరం మండలాల పరిధిలోనివి. మురుగు కాలువల ద్వారా వృథా అయ్యే నీటిని ఒడిసి పట్టి నీటి ఎద్దడిని అధిగమించేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా పాలకోడేరు, భూపయ్య కాలువ, గొంతేరు డ్రెయిన్లపై రెండు చోట్ల, పేకేరు, జంబాడ, న్యూ విప్పర్రు కాలువలపై అడ్డకట్టలు వేసి నీటిని నిల్వ చేశారు. ఈ నీటినే ఇంజిన్ల సాయంతో ఎత్తిపోసి పంటలను కాపాడగలుగుతున్నారు.

డీజిల్ సరఫరా చేస్తున్నారు



సాగునీటి సమస్య గురించి రైతులందరం కలసి ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఇంజిన్లు ఏర్పాటు చేసుకోండి, డీజిల్ ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పారు. ఆ ప్రకారం డీజిల్ ఇంజిన్ల సాయంతో నిల్వ చేసిన నీటిని తోడి పంటలు ఎండిపోకుండా చివరి దశలో కాపాడుకుంటున్నాం.

–బొంతు రాంబాబు, రైతు, ముక్కామల

ముందుగానే ఊహించి...



రబీ పంటకి నీటి ఎద్దడి ఎదురవుతుందని ముందుగానే ఊహించి అధికారులను అప్రమత్తం చేశాను. ప్రతి ఎకరాకూ పుష్కలంగా నీరందేలా చర్యలు తీసుకోవాలని సూచించాను.అధికారులు కూడా స్పందించి సకాలంలో చర్యలు చేపట్టడంతో నీటి ఎద్దడి సమస్య తీరింది. ఎక్కడైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురావాలి.

–జి శ్రీనివాస్‌నాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు

ఎమ్మెల్యే సూచనల మేరకు..



నీటి ఎద్దడి లేకుండా చూడాలని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు సూచించారు. దాంతో ముందస్తుగా డ్రైన్లపై అడ్డకట్టలు వేశాం. తర్వాత నీరు అందని ప్రాంతాలను గుర్తించి రైతులకు డీజిల్ సరఫరా చేస్తున్నాం. పెరవలి సెక్షన్ పరిధిలో వివిధ కాలువలపై 1400 ఎకరాలకు నీటి ఎద్దడి ఉంది. ఆయా భూములకు నీటిని అందిస్తున్నాం.

–కె.శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈ, పెరవలి

108 బిందెల పసుపు నీళ్లతో సోమాలమ్మకు అభిషేకం



సోమాలమ్మ వారిని పసుపు నీళ్లతో అభిషేకిస్తున్న మహిళలు

నల్లజర్ల: 'చల్లంగ చూడవమ్మా ..సోమాలమ్మ తల్లీ' అంటూ నల్లజర్ల గ్రామదేవత సోమాలమ్మ వారిని ఆ గ్రామ మహిళలు ఆదివారం 108 పసుపు నీళ్ల బిందెలతో అభిషేకించారు. ఉగాది నుంచి గ్రామంలో అమ్మవారి సంబరాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజైన ఆదివారం ఐదు వేల మందికి అన్నదానం చేశారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే క్షమించమంటూ గ్రామ మహిళలంతా పసుపు నీళ్లతో అమ్మవారిని అభిషేకించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి,పంటలు సమృద్ధిగా లభించాలంటూ అమ్మవారిని ప్రార్థించారు. పసుపు నీళ్ళు పోసే ముందు పసుపు ముద్దలతో అమ్మవారిని శాంతింపజేశారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి



పరీక్ష సామగ్రి అందిస్తున్న ఆనంద్ స్వరూప్

నల్లజర్ల: టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న చీపురుగూడెం విద్యార్థులకు సామాజికవేత్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ వసంతాడ ఆనంద్ స్వరూప్ ఆదివారం పరీక్ష సామగ్రి (అట్ట,స్కేలు, రేజర్, పెన్నులు, పెన్సిల్, హాల్ టిక్కెట్ భద్రపరుచుకునే కవరు) అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను తనతండ్రి సూరయ్య మాస్టారి జ్ఞాపకార్థం నగదు బహుమతులతో సత్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అందుగుల వెంకటేశ్వరరావు, విజయబాబు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై సమీక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



హాజరైన సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

నిడదవోలు రూరల్: పేదల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ‘జగనన్నే మా భవిష్యత్తు’ కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయిలో సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంల ఎమ్మెల్యే మాట్లాడారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పథకాలను అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలుపే లక్ష్యంగా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యులు నందిగం భాస్కరరామయ్య, కొయ్యే సూరిబాబు, ఎంపీపీలు తిరుమళ్ల భాగ్యలక్ష్మి, కార్చెర్ల ప్రసాద్, పాలాటి యల్లారేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల శాఖల అధ్యక్షులు అయినీడి పల్లారావు, వీరమల్లు సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, పార్టీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ గాజుల రంగారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా వివిధ అనుబంధాల అధ్యక్షులు ఎస్‌కే వజీరుద్దీన్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

91 శాతం ఇంటి పన్నుల వసూలు

ఉండ్రాజవరం: గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో 91 శాతం ఇంటి పన్నులు వసూలు చేసినట్టు ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామినాయుడు ఆదివారం తెలిపారు. 2022–23 సంవత్సరానికి మొత్తం ఇంటి పన్నుల డిమాండ్ రూ. 2.10 కోట్లు కాగా రూ.1.90 కోట్లు వసూలైనట్టు వివరించారు. చిలకపాడు, దమ్మెన్ను, కె.సావరం, కాల్దారి, పాలంగి, పసలపూడి, సత్యవాడ, వేలివెన్ను పంచాయతీల కార్యదర్శులు 100 శాతం పన్నులు వసూలు చేశారన్నారు. ఆయా కార్యదర్శులను ఎంపీడీఓ ఎ. శ్రీనివాసు, ఈఓపీఆర్డీ వీరాస్వామినాయుడు అభినందించారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- గోపాలపురం నియోజకవర్గంలో 15 కేంద్రాల ఏర్పాటు



టెన్త్ పరీక్షలకు హాజరుకాబోతున్న గోపాలపురం మండలం రాజంపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

దేవరపల్లి: టెన్త్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖాధికారులు గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ఈ నెల 18తో ముగుస్తాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని అధికారులు తెలిపారు. విద్యార్థులు అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు గోపాలపురం, నల్లజర్ల మండలాల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గోపాలపురం మండలం రాజంపాలెం జెడ్పీ హైస్కూల్, నల్లజర్ల మండలం పోతవరం జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గోపాలపురం మండలంలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాల్లో 908 మంది, దేవరపల్లి మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 1134 మంది, నల్లజర్ల మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 1068 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. మూడు మండలాల్లో 3110 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నట్టు విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

తాళ్లపూడి మండలం నుంచి 778 మంది..

తాళ్లపూడి: మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 778 మంది విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాస్తారని ఎంఈవో, రూట్ ఆఫీసర్ కె.వివేకానంద ఆదివారం తెలిపారు. తాళ్లపూడి జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 192 మంది, వేగేశ్వరపురం ప్రభుత్వ హైస్కూల్ కేంద్రంలో 268 మంది, మలకపల్లి జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో 318 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 38 మంది ఇన్విజిలేటర్లు మండలంలో పరీక్షల విధులు నిర్వహిస్తారన్నారు. మరో ముగ్గురిని రిజర్వులో ఉంచామన్నారు.

పెరవలి మండలం నుంచి 746 మంది

పెరవలి: మండలంలోని 746 మంది టెన్త్ విద్యార్థుల కోసం కానూరు, కాకరపర్రు, ఖండవల్లి ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మండలం నుంచి బాలురు 477 మంది, బాలికలు 269 మంది టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారు. వారిలో 148 మంది ప్రైవేట్ విద్యార్థులు కూడా ఉన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం

కొవ్వూరు: టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్లు చూపి, ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజర్ ఎస్‌వీవీఎస్ కుమార్ ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 18 వరకూ టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు ఆయన తెలిపారు.

పేదల సొంతింటి కల నెలవేరుతోంది

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- మల్లేశ్వరంలో 23 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



మల్లేశ్వరం లే అవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు తదితరులు

పెరవలి: పేదల సొంతింటి కల ఇన్నేళ్లకు నెరవేరుతోందని, వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం తన అదృష్టమని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని మల్లేశ్వరం గ్రామంలోని జగనన్న లేఅవుట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ లే అవుట్‌లో 23 మంది లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క సెంటు భూమిని కూడా కొనుగోలు చేసి పేదలకు అందించలేదని విమర్శించారు. నియోజకవర్గంలో 11,885 మందికి పట్టాలు అందించామన్నారు. వాటితో పాటు స్థలం ఉన్న 4,766 మంది లబ్ధిదారులకు గృహాలు, నిడదవోలు పట్టణంలో 1152 మంది టిడ్కో గృహాలు అందిస్తున్నామన్నారు. జగనన్న కాలనీల్లో మంచి నీరు, డ్రైనేజీ, విద్యుత్, రోడ్ల వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. లబ్ధిదారులు ఇళ్ళు నిర్మించుకోలేకపోతే తామే నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల, హౌసింగ్ ఏఈ వెంకన్న బాబు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో ఆసుపత్రి ప్రారంభం

దేవరపల్లి: గ్రామీణులకు మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిని మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆదివారం ఎమ్మెల్యే తలారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ అత్యాధునిక వైద్యం సదుపాయం అందుబాటులో లేక నియోజకవర్గంలో ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం పొందవలసి వస్తోందన్నారు. పట్టణ ప్రాంతాలకు వెళ్లే లోగా రోగులకు ప్రాణాపాయం కలుగుతోందన్నారు. దేవరపల్లిలో ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ కేశరాజు కాశీవిశ్వనాథం, ఆసుపత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

క్రీస్తు జననం, జీవితం మార్గదర్శకం

- ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జోసెఫ్ శాంతప్ప
- పలు చర్చిల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం



ముసుళ్ళగుంట ఆర్ సీఎం చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ప్రదర్శన



నిడదవోలులో మట్టల ఆదివారం హోసన్నా విజయోత్సవ ర్యాలీ చేస్తున్న విశ్వాసులు



ఊనగట్ల వీధుల్లో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

నల్లజర్ల: ఏసుక్రీస్తు జననం, జీవితం మానవాళికి మార్గదర్శకమని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జోసెఫ్ శాంతప్ప అన్నారు. మట్టల ఆదివారం సందర్భంగా మండలంలోని ముసుళ్లగుంట చర్చిలో నిర్వహించిన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ఏసు ఈ లోకంలో జీవించిన ముప్పైమూడున్నర ఏళ్లలో ఆయన బోధనలు, మరణం, పునరుత్థానం వంటి అంశాలన్నీ మానవాళికి సమాధానాలు ఇచ్చాయన్నారు. ఎరూసలెంలో ఏసుప్రభువు తొలిసారిగా ప్రవేశించిన శుభ సందర్భమే మట్టల ఆదివారం అన్నారు. ఇక్కడే వస్త్రాలు పరచి ఆయనను రాజుగా గుర్తించిన రోజన్నారు. ఉపదేశకుడు ఈబిచర్ల ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు. చీపురుగూడెం విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్‌లో పాస్టర్ మరపట్ల జ్యోజి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం కార్యక్రమం నిర్వహించారు.

నిడదవోలు రూరల్: పట్టణంలోని కృపాధార లూథరన్ చర్చి, మెంటే సుందరరావు మెమోరియల్ లూథరన్ చర్చి, ఆర్సీఎం, బెతేస్థ ప్రార్థన మందిరం, బైబిల్ మిషన్ చర్చిల ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ‘దావీదు కుమారుడా.. నీకు జయము.. జయము’ అంటూ పురవీధులలో సంఘ విశ్వాసులు హోసన్నా విజయోత్సవ ర్యాలీలు చేశారు. కృపాధార లూథరన్ చర్చిలో రెవరెండ్ విక్టర్ మోజెష్ వాక్యోపదేశం చేశారు. మండలంలోని సమిశ్రగూడెం, పురుషోత్తపల్లి, శెట్టిపేట, పెండ్యాల, డి.ముప్పవరం గ్రామాల్లోని పలు ప్రార్థన మందిరాల్లో ఆరాధనలు నిర్వహించారు.

ఉండ్రాజవరం: మండలంలోని ఉండ్రాజవరం లూథరన్, బైబిల్ మిషన్ చర్చిలతో పాటు తాడిపర్రు, చివటం, వేలివెన్ను, సూర్యారావుపాలెం, మోర్త, పాలంగి గ్రామాల్లోని క్రైస్తవ దేవాలయాలను ఆదివారం ఈత, కొబ్బరి మట్టలతో అలంకరించారు. ఈసందర్భంగా తాడిపర్రులో పాస్టర్ రెవరెండ్ కె.జయరావు మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు. క్రైస్తవ గీతాలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా విశ్వాసులు మట్టలు చేత పట్టుకుని పురవీధుల్లో ప్రదర్శన చేశారు

చాగల్లు మండలంలో..

చాగల్లు: ఊనగట్లలో పవిత్ర మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఇక్కడి నూతన నిబంధన సహవాసం ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో పురవీధుల్లో ప్రదర్శన చేస్తూ ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ మల్లిపూడి రాజేశ్వరరావు, శేషుబాబు, జి.అరవింద్, కొడమంచిలి సుబ్బారావు, పృథ్వీ, పలువురు విశ్వాసులు, చిన్నారులు ఈ వేడుకలో పాల్గొన్నారు. అలాగే బ్రాహ్మణగూడెం, నందింగంపాడు, చాగల్లు, మార్కొండపాడు, చిక్కాల, దారవరం తదితర గ్రామాల చర్చిల్లో మట్టల అదివారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.